సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చీపురుపల్లి మండలంలో కర్లాం లోని వెంకట రామ పాల్జీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన కర్లాం నుంచి చీపురుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వరకు సామూహిక రాయభారం పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు.

(వివరాలు మెయిన్ పేజీలో)

వక్ఫ్ భూములను కొల్లగొట్టేందుకు కుట్ర

- సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి
- ముస్లిం సంఘాల డిమాండ్
- మద్దతు తెలిపిన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, పలు ప్రజా సంఘాలు
- నగరంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరంలో ముస్లిములు బుధవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉర్దూ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ మూడులాంతర్లు మీదుగా ఎమ్‌జి రోడ్డు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి జంక్షన్, సిఎంఆర్ జంక్షన్, బాలాజీ మార్కెట్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిము మైనారిటీ నాయకులు మహమ్మద్ నిజాం, షకీర్ షేక్, అక్బర్ షరీఫ్, ఎమ్‌డి ఇక్బాల్, షేక్ ముస్తాదీన్, మున్వర్ బాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపి ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, డిబిఎస్‌యు నాయకులు పి.చిట్టిబాబు, బిఎస్‌పి నాయకులు పి.వెంకటరమణ మాట్లాడారు. ఎన్నికల ముందు సబ్కా వికాస్ సబ్కా సాత్' అని చెప్పిన బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిము మైనారిటీలపై దాడులు చేస్తోందన్నారు. ఇందుకు ఎన్‌ఆర్‌సి, యుసిసి, ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్ రద్దు వంటివే ఉదాహరణ అని చెప్పారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న వక్ఫ్ బోర్డును రద్దు చేసి ముస్లిముల మనోభావాలను దెబ్బతీసిందని, వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికో లేదా ఏ సంస్థకో చెందినవి కావని, ముస్లిముల అభివృద్ధి కోసం పూర్వీకులు దానధర్మాలు చేసి ఇచ్చిన ఆస్తులని స్పష్టం చేశారు. ఈ ఆస్తులపై బిజెపి ప్రభుత్వం కన్నేసిందని, సవరణ పేరుతో వాటిని దోచుకోవాలని కుట్ర పన్నుతోందని తెలిపారు. ఈ చట్టానికి మద్దతు తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ముస్లిములకు రక్షణగా ఉంటామని ఎన్నికలకు ముందు చెప్పి, ఇప్పుడు వెన్నుపోటు పొడవడం బాధాకరమని అన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ముస్లిము పండితులు, ఉలమాలు, మేధావులు ప్రాణాలర్పించారని, ఆ చరిత్రను బిజెపి ఒకసారి చదువుకోవాలని సూచించారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. అధిక సంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

కేంద్ర విద్యుత్ పథకాలు శతశాతం అమలు

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ● పిఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుకు నెలవారీ లక్ష్యాలు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పథకాలన్నిటి జిల్లాలో శతశాతం క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని విజయనగరం ఎంపి, జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పథకాల అమలు, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను పటిష్టం చేయడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడం వంటి అంశాలపై సమన్వయం కోసం జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ ఏర్పాటయ్యింది. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కమిటీ ఛైర్మన్‌గా, మరో ఎంపి ఎం.శ్రీభరత్ సహాధ్యక్షుడుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీ ఛైర్మన్ సభ్యులుగా నియమిస్తూ ఇటీవలే ఈ కమిటీ ఏర్పాటయ్యింది. కమిటీ తొలి సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కమిటీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి గ్రామాల్లో పిఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల పైకప్పులపై సౌరవిద్యుత్ ఫలకాల ఏర్పాటుకు స్థలం లేనట్లయితే గ్రామాల్లో పెద్ద చెరువుల గట్లపై సౌరవిద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో గ్రామాన్ని ఎంపికచేసి సౌరవిద్యుత్ గ్రామంగా రూపొందించేందుకు ప్రయత్నించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పి.ఎం.సూర్యఘర్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు ముందుగా తమ గ్రామాలను సంపూర్ణ సౌరగ్రామాలుగా రూపొందించడం ద్వారా ఇతర గ్రామాలకు ప్రేరణగా నిలవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా మంత్రి పాల్గొన్నారు. పిఎం కుసుమ్ ద్వారా వ్యవసాయానికి సౌరవిద్యుత్ సరఫరా, అన్ని గ్రామాలకు 24 గంటలపాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాపై మంత్రి విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ లక్ష్మణరావు ద్వారా తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే మూడు నెల్లలో 10వేల పి.ఎం.సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో పి.ఎం.కుసుమ్ పథకం కింద వ్యవసాయ ఫీడర్లకు సౌరవిద్యుత్ సరఫరాతో అనుసంధానం చేసేందుకు, సౌరవిద్యుత్ విద్యుత్ ఫలకాల ఏర్పాటుకు 64.7 ఎకరాలను గుర్తించామని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో భాగంగా జిల్లాలో 1,08,629 స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు, 11 కె.వి.ఫీడర్లకు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో విద్యుత్ పంపిణీ సంస్థ డిఇలు హరి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో బుధవారం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. హౌసింగ్, పింఛన్లు, రోడ్లు, కాలువలు, దోబీఖానాలుపై పలు వినతులు వచ్చాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకుల పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అదితి

డిజిపి నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్‌పి వకుల్‌జిందాల్, సిఐ శ్రీనివాస్ తదితరులు

జిల్లా పోలీసులకు ఎబిసిడి అవార్డు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో వివిధ జిల్లా పోలీసులు మూడు మాసాల్లో చేధించిన కేసుల దర్యాప్తును పరిశీలించి, వాటిలో ఉత్తమంగా దర్యాప్తు చేసిన కేసులకు ఇచ్చే ఎబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైం డిటెక్షన్) అవార్డులలో విజయనగరం జిల్లా పోలీసులకు మూడవ స్థానం లభించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈమేరకు రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా నుంచి పోలీసులు అవార్డును అందుకున్నారు. విజయనగరం జిల్లా వన్ టౌన్ పోలీసులు చేధించిన డిజిటల్ అరెస్టు కేసుకు ఎబిసిడి అవార్డుల్లో మూడవ స్థానం లభించింది. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన వన్ టౌన్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐవి.ఎల్.ప్రసన్న కుమార్, కానిస్టేబులు వై.రామరాజుతోపాటు కేసు దర్యాప్తులో ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేసి, ఆయా రాష్ట్రాల పోలీసుల సహాయ, సహకారాలు లభించే విధంగా చర్యలు చేపట్టిన ఎస్‌పికి రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ ఎబిసిడి అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. సిఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐ వి.ఎల్.ప్రసన్న కుమార్, కానిస్టేబులు వై.రామరాజును డిజిపి హరీష్ కుమార్ గుప్తా, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాల మేరకు బుధవారం ఇంజనీరింగ్ అధికారులు నెల్లిమర్ల చంపావతి నది వద్ద ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ వద్దకు వెళ్లి నీటిమట్టాలను గమనించారు. ఆంధ్ర నుంచి వచ్చిన నీరు ఎంత మేరకు నగర ప్రజలకు నీటి పంపిణీకి ఎంత నీరు సరిపోతుందో అంచనా వేశారు. ఇంకా ఎన్ని టిఎంసిల నీరు అవసరమవుతుందో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఇప్పటికే ఆంధ్ర నుంచి నీటిని విడుదల చేయించామని చెప్పారు. దీనివల్ల నెలరోజుల వరకు ప్రజలకు అవసరమైన నీటి లభ్యత ఉందని తెలిపారు. అప్పటికీ వర్షాలు కురవని పరిస్థితుల్లో మరోసారి ఆంధ్ర నుంచి నీటిని విడుదల చేయించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. కార్యక్రమంలో డిఇలు శ్రీనివాసరావు, ప్రసాద్, ఎఇ రవి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఐఆర్ ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వెంటనే పిఆర్‌సి కమిషన్‌నువేయాలని, అంతకుముందే ఐఆర్ ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె.జోగారావు కోరారు. యూత్‌హాస్టల్‌లో బుధవారం జరిగిన ఈ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగులో ఉన్న పిఎఫ్, సరెండర్ లీవులు, డిఎ, పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు1 తరగతి నుండి 5తరగతులు ఖచ్చితంగా ఉండేలా చర్చలు తీసుకోవాలన్నారు. బదిలీలు, పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం. మురళి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎ స్వామి బంగారయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి పెంకి. రాంబాబు పాల్గొన్నారు.

స్కిప్పింగ్ పోటీలకు సత్య కళాశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ గేమ్స్, స్పోర్ట్స్‌లో స్కిప్పింగ్ గేమ్ లో అంతర్ కళాశాల పోటీలలో విజేతలుగా నిలిచి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. వారిలో ఎం.శ్రీవల్లి, పి.రమ్య, ఎల్.వరలక్ష్మి, ఎం.సేతుమాధవి (డిగ్రీ ప్రథమ సంవత్సరం) ఈ నెల 18 నుంచి 28వరకు రాజస్థాన్ లో జరగబోయే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ హెచ్ హెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

గర్భిణులను ఆశీర్వదిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

పోషకాహారాన్ని అందించడం, అవసరమైన మందులను సరఫరా చేయడం, సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలన్నది మనందరి ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. దీనికోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో (పోషణ్ పక్వాడా) భాగంగా స్త్రీశిశు సంక్షేమశాఖ, వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల సమన్వయ సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, బాలబాలకల ఆరోగ్యంపై అన్ని శాఖలూ దృష్టి పెట్టాలన్నారు. పోషకాహారాన్ని అందించడంతోపాటు, వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయడం, తల్లులకు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సుమారు 69,000 మంది చిన్నారుల్లో, బరువు తక్కువగా ఉన్నవారు దాదాపు 4వేల మంది ఉన్నారని, వీరికి పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లాలో సుమారు 7వేల మంది మరుగుజ్జు పిల్లలు ఉన్నారని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా ఎక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణాలను అన్వేషించి, అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వ శాఖలపై ఉందని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో చిన్నవయసులోనే గర్భం దాలుస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉందని, దీనిని నివారించడానికి బాలికలకు, తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఐసిడిఎస్ పిడి రూక్సానా బేగం, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ జీవనరాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత తదితరులు మాట్లాడారు. పక్షోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు శీమంతం చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఈఓలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

2.86 లక్షల టన్నుల ఇసుక సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రస్తుత వేసవి సీజనులో జిల్లాలో నిర్మాణ రంగ అవసరాలకు సరిపడేంతగా నిరంతరాయంగా ఇసుక సరఫరాకు సిద్ధంగా వుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. వచ్చే మూడు నెలల్లో ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల కింద చేపట్టే ఇళ్ల నిర్మాణాలు, ప్రజావసరాల కోసం, ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల నిర్మాణాల కోసం 2.86 లక్షల ఇసుక సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక సరఫరా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. జిల్లాలో ప్రస్తుతం కుసుమూరు, కె.వెంకటాపురం ఇసుక రీచ్‌ల ద్వారా 89 వేల టన్నులు లభ్యమవు తుందని, రేగిడి ఆమదాల వలస మండలంలోని బొడ్డవలస, శ్రీకాకుళం జిల్లా తోటపాలెం వద్ద గల మేడమర్తిలో మరో రెండు ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు అవకాశం ఉందని, రెండు పాయింట్ల ద్వారా మరో 1.97 లక్షల టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రభుత్వ గృహనిర్మాణ పథకాలకు 10వేల టన్నులు, వైద్య కళాశాల నిర్మాణ అవసరాలకు 10వేల టన్నుల ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ తదితర ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణ పనులకు, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులకు కూడా అవసరమైన మేరకు ఇసుక సరఫరా చేయాలని సూచించారు. పోలీసులు సీజ్ చేసిన ఇసుకను గృహనిర్మాణ శాఖకు అందజేయాలని అదనపు ఎస్‌పికి కలెక్టర్ సూచించారు. జెసి ఎస్.సేతు మాదవన్, అదనపు ఎస్‌పి సౌమ్యలత, ఆర్‌డిఒ కీర్తి, జిల్లా గనులశాఖ అధికారి మోహనరావు, ఉప రవాణా కమిషనర్ మణికుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, హౌసింగ్ పీడీ మురళి, భూగర్భశాఖ డిడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తా : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని సస్పెండ్ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం 36వ డివిజన్ 43వ సచివాలయం పరిధిలో ఆయన పర్యటించారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి పంపిణీ వంటి అంశాలను పరిశీలించారు. పారిశుధ్య పరంగా కొన్ని లోపాలు గుర్తించి వాటిని సరి చేసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. లేని పక్షంలో సస్పెండ్ చేస్తామని మందలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన రీత్యా పబ్లిక్ హెల్త్ వర్కర్ ను విధుల నుండి తాత్కాలికంగా కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని అన్నారు. ఈ విషయంలో ప్రజల నుండి ఫిర్యాదులు అందిన వెంటనే పారిశుధ్య ప్రక్షాళనకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రజా ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

సచివాలయాలకి వచ్చే ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా కార్యదర్శులు కృషి చేయాలని కమిషనర్ నల్లనయ్య సూచించారు. బుధవారం 6, 8 నెంబర్ల సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాలకు కార్యదర్శులు నిర్ణీత సమయానికి హాజరవుతున్నారా లేదా అని పరిశీలించారు. రికార్డులను తనిఖీ గమనించారు. సచివాలయాలు పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పౌర సేవలు అందించేందుకు సచివాలయాల కార్యదర్శులు మరింతగా కృషి చేయాలని అన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాంగ్రెస్ అధిష్టాన నాయకులపై అన్యాయంగా దుర్మార్గపు చార్జిషీట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. బిజెపి చర్యలను నిరసిస్తూ , కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా డిసిసి ఆధ్వర్యాన ఎసిబి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు ఎం.విద్యాసగర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్ష క్రూరత్వ చర్యల్లో భాగంగా నేషనల్ హెరాల్డ్ ఆస్తులు ఏకపక్షంగా జప్తు చేయడం, కాంగ్రెస్ అధినాయకత్వానికి వ్యతిరేకంగా ఎఐసిసి మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఇతర సీనియర్ నాయకులపై ఛార్జిషీట్లు దాఖలు చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. సత్యాన్ని రక్షించండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ గేదెల తిరుపతి, గోగాడ శ్రీనివాసరావు, ముస్లిం మైనార్టీ నాయకులు షరీఫ్, ఎన్.శ్రీనివాసరావు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

చెల్లూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిఇఒ

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

చెల్లూరు, లక్కిడాం గ్రామాల్లో ఉపాధి కూలీలతో డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గంట్యాడ

ప్రభుత్వ బడుల్లో పిల్లలని చేర్పించాలని, నాణ్యమైన విద్యను అందిస్తామని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. బుధవారం చెల్లూరు, లక్కిడాం గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు, యూనిఫాం, పుస్తకాలు ,ఆటలు, అన్ని రకాలు మౌలిక సదుపాయాలు పాఠశాలలో కల్పిస్తామని తెలిపారు. పిల్లల్ని బంగారు భవిష్యత్ ప్రభుత్వ పాఠశాలల్లోనే లభ్యమవుతుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందన్నారు. డిఇఒతోపాటు డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు వెళ్లి..

ఐదేళ్లు పైబడిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు కోరారు. బుధవారం జిల్లాలోని పలు కెజిబివిల్లో పర్యటించి ,అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలలో చేరిక కోసం అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందిస్తారని తెలిపారపు. అర్హత కలిగిన నిపుణులైన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు వంటి ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. బాల బాలికల భద్రత, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిఎంఒ ఆదినారాయణ, ఎఎంఒ ప్రసాద్, ఎపిఒ గోపిచంద్, ఎఎస్ఒ సూర్యారావు, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులపై ఎమ్మెల్యేకు వినతి

వేపాడ: గ్రామ సచివాలయ వ్యవస్థలో వెల్ఫేర్ అసిస్టెంట్లుగా చేరి నేటికి ఐదున్నర ఏళ్ళు పూర్తి అయినప్పటికీ ఏ విధమైన పదోన్నతులు కల్పించలేదని తెలియజేస్తూ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎల్.కోటలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. సచివాలయంలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు ఇది వరకే పదోన్నతులు కల్పించినప్పటికీ వెల్ఫేర్ అసిస్టెంట్ లను చిన్నచూపు చూడడం తగదని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రేమ్ కుమార్, నారాయణరావు, కృష్ణ, సత్యవేణి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారాపై ప్రజలకు అవగాహన

రేగిడి: మండలం వెంకంపేట పంచాయతీ పరిధి మీసాల దోలపేట గ్రామంలో రాజాం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో బుధవారం నాటు సారా పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో నాటు సారాను నిర్మూలించ వచ్చునన్నారు. నాటు సారా తాగి అనారోగ్యంతో మరణిస్తే వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. నాటు సారా అమ్మకాలు జరిపితే సమాచారం అందించాలని సూచించారు. సారా సేవిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ప్రజలతో ర్యాలీ నిర్వహించారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

సంతకవిటి: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర రావు అన్నారు. మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి పరిస్థితి ఏర్పడకుండా యువత రక్తదానం చేయాలన్నారు. రక్తం నిల్వలు లేకపోవడంతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారన్నారు. రక్త దానం చేయడం ద్వారా, మరో ప్రాణాన్ని కాపాడవచ్చునని తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, బొద్దూరు ఎంపిటిసి వల్లూరు గణేష్, రెడ్ క్రాస్ ప్రతినిధులు పింకి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సికెఎం కళాశాల విద్యార్థికి సన్మానం

నెల్లిమర్ల: స్థానిక సికెఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థికి సన్మానం జరిగినట్లు ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలకు చెందిన బర్ల లలిత (బైపిసి) ద్వితీయ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 989 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించినందుకు (షైనింగ్ స్టార్స్ 2025) అవార్డు కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేష్ చేతులతో సన్మానం చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైతులను సత్కరిస్తున్న సర్పంచులు, సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

వేపాడ: మండలంలోని చామలాపల్లి, జగ్గయ్యపేట గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్‌టి సన్యాసమ్మ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను మెరుగుపరచడానికి భవిష్యత్తును పరిరక్షించడానికి ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారానే వాతావరణంలో వస్తున్న మార్పులను అధిగమించి మంచి వాతావరణాన్ని పొందగలమని అన్నారు. సర్పంచ్‌లు కోలా సతీష్, వంటాకు శ్రీను మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక ఆదాయం వస్తుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. ఈ సమావేశంలో విఎఎ ఎస్. దేముడు, కోమలత ఇతర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిలా రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కొత్తవలస: సుబ్బలక్ష్మి చార్టీబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 135 మంది హాజరవగా 12 మందికి కళ్ళ శస్త్ర చికత్స అవసరమని వైద్యులు గుర్తించారు. అనిల్ నీరుకొండా ఆసుపత్రి వైద్యులు జనరల్ పిజిషన్ డాక్టర్ ఆనంద్, డాక్టర్ అనంత తేజ సాయి, గైనకాలజిస్ట్ దీపకారెడ్డి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణి చేశారు. యువరాజ్ సింగ్ ఫౌండేషన్ డాక్టర్ మాధురి, సాయి చరిత తేజ కేన్సర్‌పై అవగాహన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కనకాల శివ, రవి, సూరిబాబు, మీసాల ప్రసాద్, ఏ.మధు తదితరులు పాల్గొన్నారు.

బరువు తక్కువున్న పిల్లలపై అవగాహన

గంట్యాడ: మండలంలోని రావివలస గ్రామంలో బరువు తక్కువ ఉన్న పిల్లలపై పోషక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ సుధారాణి మాట్లాడుతూ తక్కువ బరువు ఉన్న పిల్లలను గృహ సందర్శన చేసి విజయనగరం గోషా ఆసుపత్రికి శుక్రవారం పంపించడానికి తల్లులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆశ వర్కర్లు, ఎఎన్ఎం, మహిళా పోలీసు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

రామభద్రపురం: వివిధ రూపాల్లో అక్రమంగా తరలిస్తున్న సందర్భంగా సీజ్ చేసిన మద్యాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దొర సమక్షంలో స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో బుధవారం ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మండలంలో నమోదైన 34 ఎక్సైజ్ కేసులలో 576 మద్యం బాటిళ్ళు, రెండు నాటుసారా కేసులలో 79 లీటర్ల నాటుసారాను భూమిలో గొయ్యి తవ్వి అందులో పారబోసి ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించడం అక్రమంగా మద్యం తరలించడం, నాటుసారా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

సిఎం దృష్టికి కార్యకర్తల సమస్యలు

భోగాపురం: నియోజకవర్గంలో కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. సచివాలయంలో చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడాల్సిన పనిలేదని విధానపరమైన సమస్యలు పరిష్కారం చేసేందుకు ఆదేశాలు ఇస్తానని సిఎం చెప్పినట్లు కర్రోతు తెలిపారు. నిత్యం కార్యకర్తలు, ప్రజలతో మమేకంగా ఉండాలని చెప్పినట్లు తెలిపారు.

సెంచూరియన్‌లో రోబోథాన్ 2కె25

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం రోబోథాన్ 2కె25 నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ కె.దర్వేకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన కోర్సులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రాజెక్టుల మూల్యాంకనం చేసి బాగున్నాయని కితాబునిచ్చారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌విఎస్‌కె దీపక్ కుమార్ కన్వీనర్ గా వ్యవహరించారు. డీన్ డాక్టర్ సన్నీడయాల్, ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంజయ్‌ను సత్కరిస్తున్న విసి మహంతి

అధికారుల అవినీతితోనే భూ వివాదాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని రెవెన్యూ అధికారుల అవినీతితోనే భూ వివాదాలు పెరుగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు విమర్శించారు. బొబ్బిలి సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రామభద్రపురం మండలంలోని ఉన్న ప్రభుత్వ భూములపై పెత్తందారుల కన్ను పడడం వారికి రెవెన్యూ అధికారుల అండదండలు ఉండడంతోనే భూ వివాదాలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి 1964లో మూడడ్ల జగన్నాధంనాయుడు భూమి దానం చేస్తే ఆ స్థలంలో ప్రభుత్వం పశువుల ఆసుపత్రి నిర్మించిందన్నారు. రామభద్రపురం నడిబొడ్డున ఉన్న స్థలం రూ.కోట్ల విలువ చేయనుండడంతో ఆ స్థలంపై పెత్తందారుల కన్ను పడడం వల్ల ఆయన

తమకు వచ్చిన కోర్టు నోటీసును చూపిస్తున్న నాయకులు

కుమారుడు మరణించినప్పటికీ కోడలుతో తమకు స్థలాన్ని అప్పగించాలని దరఖాస్తు చేపించి రెవెన్యూ అధికారులు అప్పగించారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని రెండేళ్ల క్రితం సిపిఎం పోరాటం చేసిందని చెప్పారు. జనసేన నాయకుడు మహంతి దనంజయ్ హైకోర్టులో కేసు వేయడంతో కక్ష పెట్టుకుని హత్యాయత్నానికి పాల్పడ్డారని అన్నారు. రామభద్రపురం మండలంలోని కొట్టక్కి, తారాపురం, కొండకెంగువ, గొల్లలపేట, నరసాపురం, రొంపల్లివలస తదితర గ్రామాలలో ప్రభుత్వ భూములు పెత్తందారుల చేతిలో ఉన్నాయని, ఆయా భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కొట్టక్కి చెరువు ఆక్రమణపై ఏడాది క్రితం చెరువు అని బోర్డు పెట్టిన అధికారులు ఇప్పుడు జిరాయితి భూమి అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చెరువును కాపాడాలని సీపీఎం పోరాటం చేస్తే ఆక్రమణదారులు తమకు కోర్టు నోటీసులు పంపించడం అన్యాయమన్నారు. పశువుల ఆసుపత్రి స్థలంలో ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం ఉన్నారు.

విగ్రహావిష్కరణ తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎమ్మెల్యే

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సరస్వతి దేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, కోరుపోలు అప్పారావు, గొంప దుర్గా, ఉమేష్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విస్తృత పర్యటన చేశారు. తెర్లాం మండలంలోని పెరుమాళి గ్రామంలో చెగుడువీధి ప్రజలు మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని వెంటనే తన సొంత నిధులతో బోరు తీయించి, మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయించారు. ఆయన చేతుల మీదుగా మంచినీటి ట్యాంకును ప్రారంభించారు. పూలువలస గ్రామంలో కోదండ రామ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డి గదభవలసలో సిమెంట్ బ్రిక్ మిషన్ ప్రారంభించారు. సుందరాడ గ్రామంలో దాకారపు వెంకన్న కుమారుడు మరణించిన విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకట్ నాయుడు, మాజీ ఎంపిపి నర్సుపల్లి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి, పెరుమాళి నాయకుల అప్పుచురాజు, మాజీ ఎంపిటిసి జగ్గరాజు, మర్రాపు శంకర్రావు, నాయకులు, పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

అయోధ్య రామమందిరానికి బొబ్బిలి వీణ

అయోధ్య రామమందిరానికి బొబ్బిలి వీణ పంపించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. అయోధ్య కోసం తయారు చేస్తున్న వీణను బుధవారం ఆయన పరిశీలించారు. బొబ్బిలి వీణ ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు అయోధ్యకు పంపిస్తున్నామని చెప్పారు. గొల్లపల్లి గ్రామదేవత పండగ లోగా వీణ తయారు చేసి ఇస్తామని కళాకారులు చెప్పగా వీణ ఇచ్చిన వెంటనే అయోధ్య పంపిస్తామని బేబినాయన అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

ప్రజాశక్తి- తెర్లాం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని ఎంఇఒ జె.త్రినాధరావు అన్నారు. 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఎన్‌రోల్‌మెంట్ డ్రై ప్రోగ్రామ్‌ను ఆయన ఆధ్వర్యంలో బుధవారం కుమ్మరిపేట, తెర్లాం, పెరుమాళి, కునయవలస అంగన్వాడి కేంద్రాలను సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. క్లస్టర్ వారీగా అంగన్వాడి సిబ్బందిని కలిసి అంగన్‌వాడీలో ఉన్న 5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -2 పాపారావు, జిల్లా పరిషత్ హైస్కూల్ పెరుమాళి ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, సిహెచ్ త్రిమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎన్ లక్ష్మి, శ్రీదేవి, గీత, సునీత, జి.లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలో జరుగుతున్న ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలను సమగ్రశిక్ష విజయనగరం సెక్టోరియల్ ఏఎస్‌ఒ సిహెచ్ జగన్మోహన్, అసిస్టెంట్ సియమ్‌ఒ కె.రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఒ జగన్మోహన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, అంగన్వాడి టీచర్స్‌ను కోరారు. ఉపాధ్యాయులు డోర్ టు డోర్ డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వివిధ సౌకర్యాలను తెలియపర్చి తల్లిదండ్రులను మోటివేట్ చేయాలని చెప్పారు. సియమ్‌ఒ రామారావు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం (2025-26) ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు జి.శ్రీదేవి, బి.శ్రీనివాసరావు, సిఆర్‌యమ్‌టిలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సిజిఆర్ఎఫ్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం గంట్యాడ విద్యుత్తు కేంద్రం వద్ద జరిగిన సిజిఆర్ఎఫ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసం వినతి పత్రాలను స్వీకరించారు. ఎటువంటి ఖర్చు లేకుండా వినియోగదారుల సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. తమ సమస్యలను 1912 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, పోస్టల్ ద్వారా విశాఖపట్నంలో ఉన్న ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయానికి పంపించాలన్నారు. సరఫరాలో అంతరాయాలు, కాలిపోయిన మీటర్, ఓల్టేజ్‌లో హెచ్చు తగ్గులు, సర్వీసు లోపాలు, కనెక్షన్ మార్పు, కొత్త కనెక్షన్ జారీలో ఆలస్యం, రీ కనెక్షన్ సమస్యలలో తప్పులను 60 రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. సమస్యను పరిష్కరించడానికి సిబ్బందినే ఇంటికి పంపిస్తామన్నారు. శ్రీకాకుళము నుంచి ఏలూరు వరకు 11

మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

జిల్లాల్లో ఈ వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఇప్పటి వరకూ 8,679 కేసులు వచ్చాయని వీటిలో 8,508 కేసులను పరిష్కరించామని చెప్పారు. 171 కేసులు పరిష్కారం చేయవలసి ఉందన్నారు. సమస్య ఏర్పడినప్పుడు నుంచి వినియోగదారుడు తమ సమస్యలను రెండు సంవత్సరాల లోపు తమకు తెలియజేస్తే సమస్య పరిష్కారం చేస్తామన్నారు. 2023లో 536 కేసులు 2024లో 567 కేసులు వచ్చాయని వాటిని పరిష్కరించామని చెప్పారు. 2025లో 350 కేసులు వచ్చాయని వీటిలో 170 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వివిధ రూపాలలో 108 కేసులకు రూ.14,36,950 నష్ట పరిహారం చెల్లించామని చెప్పారు. వివిధ ప్రమాదాలలో చనిపోయిన వారికి లక్షల రూపాయలు చెల్లిస్తారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గీయులకు 200 యూనిట్ల విద్యుత్తును, రైతులకు తొమ్మిది గంటల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామన్నారు. గంట్యాడ మండల పరిధిలో ఐదు ఫిర్యాదులు వచ్చాయని ఒక ఫిర్యాదును పూర్తి చేశామని చెప్పారు. అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులకు సిజిఆర్ఎఫ్ పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి దీనిపైన వినియోగదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.సత్యనారాయణ, సుబ్బారావు, తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, కళాశాల ప్రధానోపాధ్యాయులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

అగ్ని ప్రమాదాలు నిరోధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బాడంగి అగ్నిమాపక అధికారి రామసూర్యారావు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సాయినగర్లో ఉన్న అపార్ట్మెంటు వాసులకు ఈ ప్రమాదాలపై బుధవారం సూచనలు, సలహాలు అందించారు. ఇంటిలోని చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దన్నారు. చెడిపోయిన గ్యాస్ ట్యూబులను వెంటనే మార్చాలని, ఎల్పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వాల్వు నిలుపుదల చేయాలని సూచించారు. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయరాదని, వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు సిలెండర్లు ఉంచరాదని, దీనిపై మహిళలు అవగాహన కల్పించుకోవాలని అన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయున్న జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ ఆఫీస్ దగ్గర బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్స్‌కు సుమారుగా 6 నుంచి 15 నెలల వరకు జీతాలు బకాయి ఉంచడం అన్యాయమన్నారు.

ఇన్ని నెలలు జీతాలు బకాయి ఉంచితే వాళ్ల కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒకు గ్రీన్ అంబాసిడర్లకు తక్కువ నెలలు జీతాలే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమాచారం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. పది నెలల జీతాలు బకాయి ఉంటే మూడు నెలలు లేదా రెండు నెలలు బకాయి ఉందని చూపించడం చాలా అన్యాయమన్నారు. వెంటనే దీనిపైన సమగ్ర దర్యాప్తు చేసి బకాయి ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ రామకృష్ణకు వినతి పత్రాన్నిచ్చారు. ఎంపిడిఒ మాట్లాడుతూ వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి తప్పకుండా జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జీతాలు వెంటనే ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిఐటియు నాయకులు గ్రీన్ అంబాసిడర్లు హెచ్చరించారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

వివిధ సమస్యలపై ఎమ్మెల్యే లోకం మాధవి బుధవారం వినతులను స్వీకరించారు. భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దయ అనే స్వచ్ఛంద సంస్థ వల్ల మత్స్యకారులందరం మోసపోయామని ముక్కాం పంచాయతీ చోడిపిల్లిపేటకు చెందిన పలువురు చోడిపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. 'మీరు కొంత సొమ్ము కడితే మిగతా సొమ్ము మేము వేసి ఇల్లు కట్టిస్తామని చెప్పి లక్షల్లో దోచుకున్నారని' మహిళలు అంతా ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని మహిళా ఎస్ఐకి సూచించారు. పింఛన్లు, రోడ్లు, విద్యుత్ సమస్యలు, భూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సిహెచ్ వెంకటరమణ, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, జలపారి శివ, వందనాల రమణ పాల్గొన్నారు.

సర్వే అసిస్టెంట్ తొలగింపునకు సిఫార్సు

నెల్లిమర్ల: నెల్లిమర్ల మండల సర్వే అసిస్టెంట్ పతివాడ రమణను తొలగించడానికి ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. బుధవారం ఎమ్మెల్యే లోకం మాధవికి మండల సర్వే అసిస్టెంట్ అవినీతిపై బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆమె స్పందించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో అక్రమ ఆర్థిక లావాదేవీలు నిర్వహించారన్న ఆరోపణలపై బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సర్వే అసిస్టెంట్‌ని తొలగించాలని సంబంధిత ఎంఆర్‌ఒకు ఆదేశించినట్లు తెలిస్తోంది. మండల ప్రజలకు పతివాడ రమణ అనే వ్యక్తితో ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి ఆర్థిక లావాదేవీలను ఇకపై కొనసాగించవద్దని, అతనిపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్త వహించవలసిందిగా ఆమె సూచించారు.

భూకంపంపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి- భోగాపురం

విపత్తుల నిర్వహణలో భాగంగా బుధవారం మండలంలోని చేపల కంచేరు ఎంపియూపి పాఠశాల వద్ద భూకంపం పై మాక్ డ్రిల్ నిర్వహించారు. భూకంపం సంభవించినపుడు భవనాల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి ఏ విధంగా కార్యక్రమాలు చేపడతారనే అంశాలను ప్రదర్శించారు. ఎస్‌డిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ చంద్ర శేఖర్ నేతృత్వంలో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. భూకంపం వచ్చినందున ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ భూకంపాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, అత్యవసర వాహనాల్లో ఆసుపత్రికి తరలించడం వంటి కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. భూకంపం సంభవించినపుడు అగ్ని ప్రమాదాలు జరిగితే ఏ విధంగా ప్రజలు తమను తాము రక్షించుకోవాలో కూడా మాక్ డ్రిల్ చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు ప్రాణ నష్టం, ధన నష్టం జరగకుండా ఎలా చర్యలు చేపడతామనే అంశాల పై 17 శాఖలకు చెందిన అధికారులు వారి శాఖాపరమైన ప్రణాళికలు వివరించారు. అనంతరం బీచ్ వద్ద సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని రక్షించడం, తుఫాన్లు, వరదలు సంభవించినపుడు ప్రజలు ఎలా అప్రమతంగా ఉండాలనే అంశాలను అవగాహన కలిగించారు. అగ్నిమాపక శాఖ ద్వారా గ్యాస్ సిలెండర్ లీక్ అయినపుడు, వంట గదిలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా అదుపు చేయాలో వివరించారు. మేడపై చిక్కుకున్నవారిని రోప్ సహాయంతో ఎలా రక్షించాలో చేసి చూపించారు. ఈ మాక్ డ్రిల్‌లో ఎస్‌డిఆర్ఎఫ్ బృందం, అగ్నిమాపక శాఖలు విపత్తుల సమయంలో వారు వినియోగించే ఎక్విప్మెంట్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ డిపిఎం రాజేశ్వరి, జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రకాష్, తహశీల్దార్ సురేష్, విపత్తుల శాఖ పర్యవేక్షకులు రామకృష్ణ, పశుసంవర్ధక శాఖ, మత్స్య, ఆరోగ్య, పౌర సరఫరాలు, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతి రాజ్, ఆర్అండ్‌బి, ఐసిడిఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలకు చెందిన అధికారులు, చేపల కంచేరు సర్పంచ్ నరసింగరావు, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

జిల్లా జడ్జికి ఘన సన్మానం

బొబ్బిలి: గుంటూరు జిల్లా జడ్జిగా బదిలీ అయిన విజయనగరం జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తిని బొబ్బిలి న్యాయవాదులు సన్మానించారు. బొబ్బిలి కోర్టులో బుధవారం సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్ మురళీకుమార్ మాట్లాడుతూ బొబ్బిలి కోర్టు భవనం శిథిలావస్థకు చెరడంతో నూతన భవనం మంజూరుకు జిల్లా జడ్జి కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎస్ జడ్జి దామోదర్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, ఏజెఎఫ్‌సిఎం ఎం.రోహిణిరావు, బార్ జనరల్ సెక్రటరీ కొల్లి సింహాచలం, న్యాయవాదులు ఎం.బెనర్జీ, అమరావు రామకృష్ణ, ఎం.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తులు అందజేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో ఎస్‌సి రాయితీ రుణాలకు ఆ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అందజేయాలని ఎంపిడిఒ రత్నం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి సంబందించి మండలానికి 11 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. పారిశ్రామిక, రవాణా రంగానికి ప్రాధాన్యత ఇచ్చి ఆయా రంగాల్లో ప్రావీణ్యత ఉన్న అభ్యర్థులు ఐఎస్‌బి సెక్టార్ టైప్ 1,2 ట్రాన్స్‌పోర్టు సెక్టార్ టైప్ 1,2లలో అభ్యర్థి ప్రావీణ్యత మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో రంగంలో 3 లక్షల వరకు రుణం మంజూరు చేస్తారన్నారు. దీనిలో 40 శాతం రాయితీ కాగా 55 శాతం బ్యాంకు రుణంగా ఉంటుందని మిగిలిన 5శాతం లబ్ధిదారు మార్జిన్ మనీగా చెల్లించవలసి ఉంటుందని అన్నారు. అర్హత, ప్రాధాన్యతల మేరకు పారదర్శకంగా ఎంపిక చేసి బ్యాంకుల మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.

వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆంధ్ర రాజా రామ్మోహన్ రాయ్‌గా పిలవబడే కందుకూరి వీరేశలింగం తెలుగు నాట గొప్ప సంఘ సంస్కర్త అని రోటరీ, కారుణ్య సంస్థల చైర్మన్ జెసి రాజు అన్నారు. వీరేశలింగం పంతులు జయంతి నేపథ్యంలో ఆయన తెలుగు ప్రజలకు చేసిన సామాజిక సంస్కరణలు స్మరిస్తూ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. జెసి రాజు మాట్లాడుతూ మహిళాభ్యుదయం విద్యతోనే ముడిపడి ఉన్నదని నమ్మి మహిళా విద్యను ప్రోత్సహించారని గుర్తుచ చేశారు. ఈరోజు మహిళలు విద్యావంతులై అన్నిరంగాల్లో స్వేచ్ఛగా ముందుకు వెళ్తున్నారంటే ఆయన కృషేనని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో రోటరీ ప్రతినిధులు శ్రీ హరి, శివ కాంత్, సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి మోదవలస సర్పంచ్ గుడ్‌బై

ప్రజాశక్తి - డెంకాడ

వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కనకాల రామారావు, ఆయన భార్య సర్పంచ్ కనకాల పోలమాంబ వైసిపికి గుడ్ బై చెప్పారు. వైసిపి ఆవిర్భావం నుంచి సేవలందించినా తనకు అధిష్టానం సరైన గుర్తింపు ఇవ్వలేదని ఉద్దేశంతో పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. పార్టీకి చాలా సేవలు అందించామని పార్టీ తరపున గుర్తించలేదని, గుర్తించని పార్టీలో కొనసాగడం కష్టమని ఆయన తెలిపారు. రామారావు గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు. ఇప్పుడు తన భార్య పోలమాంబ గ్రామ సర్పంచిగా ఉన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ పై నుంచి పడి భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - డెంకాడ

మోటార్ సైకిల్ పై నుంచి పడి భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చొల్లంగి పేట జంక్షన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఎన్‌జిఆర్‌పురం గ్రామానికి చెందిన జిగిలి రామప్పడు (54) తన భార్య జిగిలి మహాలక్ష్మితో కలిసి తమ మోటార్ సైకిల్‌పై గజపతినగరం మండలం గంగచోళ్ళపెంట గ్రామానికి వెళ్లేందుకు ఇంటి వద్ద నుండి బయలుదేరారు. మండలంలోని కుమిలి విజయనగరం రహదారి చొల్లంగిపేట జంక్షన్ వద్దకు వచ్చేసరి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న గోతులో పడిపోయింది. మోటార్ సైకిల్ నడుపుతున్న రాములప్పుడు, భార్య మహాలక్ష్మి ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో రాములప్పుడు తలకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు భార్య మహాలక్ష్మి కాళ్లకు, నడుముకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను వెంటనే జిల్లా ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. మృతుని తమ్ముడు రాము ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

అక్రమ మద్యం, నాటుసారా నియంత్రణకు కృషి చేస్తున్నామని, బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేపట్టినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్. దొర హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రసాదరావుతో కలిసి ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. మార్చి నెలలో 490 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, 173 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ఇప్పటికే అనేక చర్యలు చేపడుతున్నామని, జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నామని తెలిపారు. నవోదయం పథకం ద్వారా నాటుసారాపై ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నామన్నారు.

BOBBILI MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

Roc. No. 74/2023/E1, Dt.16.04.2025

S.No.	Nit No.	No. of works	Estimated cost
1	03/2025-26/DYEE/1-8, Dt.16.04.2025	8	Rs.22.40 lakhs
Bid Document Downloading Start Date		17.04.2025 at 11.00 AM	
Bid Document Downloading End Date		21.04.2025 at 10.30 AM	
Last Date & Time for receipt of Bids		21.04.2025 at 11.30 AM	
Technical Bid opening Date		21.04.2025 at 12.30 PM	

Note: Other details please read e.procurement market plan https://tender apeprocurement.gov.in

Commissioner,
Bobbili Municipality